1981 పత్రికా స్వాతి ప్రథమ అవార్డు పొందిన కథ

జననీ జన్మభూమిశ్చ...

రాత్రి పన్నెండు గంటలు కావస్తుంది.

రమేష్ చదువుతున్న మెడికల్ జర్నల్ మూసి టేబుల్ మీదుంచి, పడుకొనేందుకు లేవబోతున్నంతలో ఎవరో తలుపు తడుతున్న చప్పుడవటంతో బయటకు నడిచాడు.

తలుపు తీయగానే ఎదురుగా కళా కాంతులులేని ముఖంతో సీతాపతిగారు.

ఆయన రావటం మొదటిసారి కాదు గనుక ఎందుకని ప్రశ్నించే అవసరం లేకపోయింది. అవతల రోగి పరిస్థితిని ఆయన ముఖంలోనే చదవ గలిగాడు. తనెందుకు వచ్చాడో రమేష్ గ్రహించ గలడు కనుక ఆయనా చెప్పే ప్రయత్నం చెయ్యలేదు.

"మాస్టారూ! ఒక్క నిమిషం...." అంటూనే లోపలకు వెళ్ళి బట్టలు మార్చుకొని మెడికల్ కిట్‌తో బయటకు వచ్చాడు.

ఇద్దరూ రోడ్డుమీద కొచ్చారు. సీతాపతిగారుండేది ప్రక్కవీధి లోనే గనుక కొద్ది నిమిషాల్లోనే అక్కడికి చేరుకొన్నారు. ఆ కొద్ది నిమిషాల కాలం ఎంతోసేపులా అనిపించింది ఆయనకు.

వాకిట్లో నిలబడి ఆదుర్దాగా ఎదురు చూస్తున్న వసంత వాళ్ళిద్దర్నీ చూసి ధైర్యం కూడదీసుకొంటూ లోపలకు తప్పుకొంది. చిరపరిచితమయిన ఇల్లు గనుక రమేష్ ముందుగా గదిలోకి అడుగు పెట్టాడు.

ఆయాసంతో వూపిరందక మెలికలూ తిరుగుతూ అవస్థపడు తున్న భార్యను చూస్తుంటే సీతాపతిగారి కళ్ళలో నీళ్ళు నిలిచాయి. 'భగవంతుడా! దేవతలాంటి సరస్వతికి ఇంతటి శిక్ష ఎందుకు విధిం చావ్?' అనుకొంటూ పైపంచెతో కళ్ళద్దుకొన్నారు.

రమేష్ వెంటనే పరీక్షించి రెండు ఇంజక్షన్స్ ఇచ్చాడు. సరస్వతి పడుతున్న బాధ గుండెల్ని పిండుతుంటే మౌనంగా చూస్తుండిపోయారు సీతాపతిగారు, వసంత. ఆ నిశ్శబ్దంలో ఆవిడ మూలుగు దుర్భరంగా వినిపిస్తుంది.

కొద్ది నిమిషాలకు సరస్వతి కాస్త తేరుకుని కళ్ళు విప్పి చూసింది.

సీతాపతిగారు మంచంమీద కూర్చొంటూ, "ఎలా వుంది సర స్వతీ?" అడిగారు అనునయంగా.

ఆవిడేం సమాధానం చెప్పలేదు. కొద్ది క్షణాల తర్వాత పెదాలు విప్పి ఏదో మాట్లాడాలని ప్రయత్నించింది. అతి కష్టం మీద "కృ....ష్ణ...." అనగలిగింది.

సరస్వతి ఎవరి గురించి అడుగుతుందో గ్రహించిన సీతా పతిగారి హృదయం ములుపోటు తగిలినట్లుగా కలుక్కుమంది. సమాధానం ఏం చెప్పాలో తోచక మౌనంగా వుండిపోయారు.

భర్త నుండి ఏ సమాధానం రాకపోవటంతో సరస్వతి నిరాశగా కళ్ళు మూసుకుంది.

రమేష్ వరండాలోకి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

కొద్దిసేపటికి సరస్వతి అలాగే మగతలోకి జారిపోయింది. సీతాపతిగారు వరండాలోకి నడిచారు.

"రమేష్ : ఫర్లేదంటావా?" అడిగారాయన పడక కుర్చీలో కూర్చొంటూ.

రమేష్ వెంటనే సమాధానం చెప్పలేదు. "మాస్టారూ! మనోవ్యాధికి మందు లేదు. దానికి తోడు అమ్మగారి శారీరకస్థితి ప్రమాదంకేసి నడిపిస్తున్నట్లుంది. ఈ రోజు మరీ ఎక్కువగా వున్నట్లుంది." చెప్పాడు.

ఎంతో కాలం ప్రేమానుభూతులను మధురంగా పంచియిచ్చే దాంపత్యపు చివరిదశ ఒక విషాదపు వీడ్కోలు. దేవతా స్వరూపిణిలా సుఖసంతోషాలను పంచియిచ్చిన భార్యను రక్షించుకోలేని అశక్తతకు ఆయన హృదయం తల్లడిల్లిపోతుంది.

"రమేష్! జీవంపోసి జన్మనిచ్చిన భూమినే వృక్షంలాఎదిగి నిలదొక్కుకొనేందుకు వేళ్ళతో చీల్చుతుంది మొక్క. మానవ

సైజం కూడా అలాగే మారుతుంది కదూ!" అంటుంటే ఆయన కంఠం వణికింది.

"మాస్టారూ!" ఆశ్చర్యంగా చూశాడు రమేష్. ఆయన మాటలు ఎవర్ని ఉద్దేశించో వెంటనే స్ఫురించలేదు. కాని ఊహించేందుకు ఎక్కువసేపు పట్టలేదు.

"కృష్ణకు కేబుల్ ఇచ్చి వారం రోజులవుతుందా మాస్టారూ?"

"అవుతుంది. కనీసం ఏ సమాధానం రాలేదు. అంత బాధలోను సరస్వతి వాడికోసం పడే ఆరాటం వేలాది మైళ్ళ దూరంలో వున్న వాడికి ఎలా తెలుస్తుందంటావు?" వెనక్కు చేరగిలబడి బాధగా కళ్ళు మూసుకున్నారు,

ఆయన పడుతున్న ఆవేదన రమేష్ హృదయాన్ని కదిలించింది. "బాధపడకండి మాస్టారూ! కృష్ణ త్వరలో తప్పక వస్తాడు." ఆయనకు ధైర్యం చెప్పాలన్న ఉద్దేశంతో అన్నాడే కాని నిజంగా నమ్మకంలేదు.

ఆ మాటలు విన్నా వినపడనట్లే మౌనంగా వుండిపోయారు.

"బాబూ రమేష్! ఇప్పటికే చాలా పొద్దుపోయింది. ఇక నీవు వెళ్ళరాదూ!" అన్నారు సీతాపతిగారు కళ్ళువిప్పి.

"ఫర్వాలేదండీ! కొద్దిసేపు చూసి మరో ఇంజక్షన్ ఇచ్చి వెళ్తాను." చెప్పాడు.

"క్షమించు బాబూ! నీకు చాలా శ్రమ ఇస్తున్నాను." అన్నారు కృతజ్ఞతగా.

"మాస్టారూ! పెద్దవారు మీరలా అనకండి. ఇది నా వృత్తి

ధర్మం-అంతేకాదు మీ విషయంలో నా బాధ్యత. ఏ సమాజంలో అయితే వ్యక్తులు తమ జీవితాలను సంఘపరంగా తీర్చిదిద్దుకోగలుగుతారో అదే చైతన్యవంతమయినది. ఎక్కడ వైయక్తికంగా మలుచుకుంటారో అది జడమైనది, అని మీరన్న మాటలే నా జీవితానికి ఒక లక్ష్యాన్ని బోధించాయి." అన్నాడు పూజ్యభావంతో.

అంత బాధలోనూ సీతాపతిగారికి ఆ మాటలు ఎంతో ఉపశమనం కలిగించాయి. అంతలోనే విచారం కూడా కలిగింది.

తన కొడుకు కృష్ణ, రమేష్ ఇద్దరూ తన విద్యార్థులే. కృష్ణ జీవితం ఆశయాలతో ప్రభావితం కావాలని ఆశించిన దానికి భిన్నంగా జరిగినా, కేవలం శిష్యుడైన రమేష్ మాత్రం తన ఆశయాలను ప్రతిబింబిస్తున్న అద్దంలాంటివాడు.

ఒకే పరిసరాలలో పెరిగిన ఇద్దరు వ్యక్తులు భిన్నంగా ప్రభావితం కావటానికి కారణం ఆయా వ్యక్తుల ఆలోచనా విధానంలో వున్న భేదమే. ఆ భేదమే ఇద్దరి మార్గాలనూ వేరు చేసింది.

రమేష్ కలవారి బిడ్డ కాదు. కేవలం స్వయం ప్రతిభతో కష్టపడి డాక్టరై, వెంటనే డిస్పెన్సరీ పెట్టుకున్నాడు. కొద్ది కాలంలోనే మనసున్న డాక్టరుగా పేదప్రజల అభిమానపాత్రుడయ్యాడు. డబ్బున్న వాళ్ళను తనపట్ల ఆకర్షింపజేసుకొని, ప్రాచుర్యంతో లక్షలు సంపాదించాలన్న ఆరాటం, వ్యామోహం అతని కేనాడూలేవు.

అతన్ని తమ అల్లుడిగా చేసుకోవాలని ఎందరో లక్షాధికారులు పోటీపడ్డారు. విదేశాలకు పంపిస్తామని ఆశలు చూపారు. కాని రమేష్ వ్యతిరేకించాడు. వచ్చిన అవకాశాలను అవివేకంతో

జారవిడుచు కొంటున్నాడని అతని తండ్రి తన దగ్గర ఎన్నోసార్లు బాధపడ్డాడు.

తనోసారి ఆ సంగతి ప్రస్తావిస్తే "మాస్టారూ! డాక్టర్ వృత్తిని సేవాధర్మంగా స్వీకరించాను. నాకున్న కొద్దిపాటి ప్రతిభను నా దేశానికి, ప్రజలకు నిస్వార్థంగా అర్పించగలిగితే, తమవాడిగా ఇక్కడవారిచ్చే గౌరవస్థానం నాకెంతో తృప్తినిస్తుంది. కేవలం డబ్బు సంపాదించటం కోసమే వచ్చిన పరాయి దేశస్థుడిగా అక్కడ చూడబడుతూ, నా వృత్తిని పెట్టుబడిగా చేసుకోవటం నా కిష్టంలేదు." అన్న రమేష్ ఆదర్శానికి ముగ్ధుడయ్యాడు. చైతన్యవంతమైన ఒక యువతరపు ప్రతినిధి అతనిలో కనిపించాడు.

తనకు నచ్చిన ఒక సాధారణ యువతిని నిరాడంబరంగా వివాహం చేసుకొన్నాడు. మొదట్లో తల్లిదండ్రులు నిరసించినా, ప్రేమాభిమానాలకు ఆలవాలమై, అత్తమామలను పసిబిడ్డల్లా చూసుకొనే కోడలి వ్యక్తిత్వానికి ముగ్ధులై మనవలతో చరమ జీవితాన్ని హాయిగా గడుపుతున్నారు.

అంత అదృష్టం అందరికీ వుండొద్దూ!

తాము పోషించి, పెంచి పెద్దజేసిన వారి నీడలో జీవితపు చివరి రోజులు ప్రశాంతంగా గడిచిపోవాలనే ప్రతిఫలం ఒక్కటే బిడ్డల్నుండి ఆశిస్తారు కన్నవాళ్ళు-అది దక్కనినాడు జీవితం ఎంత బాధాకరం?

జీవితపు చివరిదశలో బిడ్డకోసం అలమటిస్తున్న తల్లి హృదయఘోష వినిపించనంత దూరంలో కృష్ణ వున్నాడు. వాడికి

బాంధవ్యాలు అర్థంలేని సెంటిమెంట్స్.డాక్టరు గనుక వాడి దృష్టిలో తల్లి, గతించబోతున్న ఒక జీవి మాత్రమే!

"మాష్టారూ! వస్తాను." రమేష్ పిలుపుకు ఉలిక్కిపడ్డా రాయన. ఆలోచనలతో రమేష్ లోనికి వెళ్ళి ఇంజక్షన్ ఇచ్చి రావ టం కూడా గమనించలేదు.

"ఇంజక్షన్ ఇచ్చాను. ప్రస్తుతం భర్వాలేదు. అవసరమైతే వెంటనే రండి మాష్టారూ!" ముందుకు కదిలాడు.

"అలాగే! వెళ్ళిరా బాబూ!" అన్నారు లేచి కళ్ళొత్తు కొంటూ.

రమేష్ వెళ్ళిపోయాడు.

అతను కనుమరుగవగానే లోపలకు వెళ్ళారు. మంచం ప్రక్కనే చతికిలబడి కునికిపాట్లు పడుతున్న వసంతకేసి జాలిగా, వాత్సల్యంగా చూస్తుండిపోయారు.

సరస్వతి మంచాన పడిందని తెలిసి ఉద్యోగానికి సెలవుపెట్టి, పిల్లలిద్దర్నీ అత్తగారికి అప్పజెప్పి రెక్కలుగట్టుకు వాలింది. ఈ ఇరవై రోజులు వసంతే గనుక లేకుంటే తనెంత ఇబ్బంది పడాల్సి వచ్చేదో!

జీవితం ఎంత చిత్రం! మనిషి ఆశించిన ప్రేమాభిమానాలు ఎదురుచూసిన వారినుండి లభించవు. అవి ఎదురుచూడని వారినుండి ఒకోసారి యాదృచ్ఛికంగా లభిస్తాయి. కడుపున పుట్టకపోయినా వసంత చూపే ప్రేమాభిమానాలు కన్నకొడుక్కి లేకపోయాయి.

భారంగా నిట్టూర్చారాయన.

"అమ్మా! నువ్వు కాసేపు పడుకోరాదూ! నేనుంటానిక్కడ!" అన్నారు వాత్సల్యంగా.

వసంత కళ్ళువిప్పి చూసి, "ఫర్వాలేదు మావయ్యా! మీరెళ్ళి విశ్రాంతి తీసుకోండి. అవసరమైతే పిలుస్తాను." అంది.

తనెంతగా చెప్పినా వసంత అక్కడ్నుంచి కదలదని తెలుసాయనకు. సరస్వతిని కంటికి రెప్పలా కాచుకొంటూ, వేళకు తిండి నిద్రా లేక చిక్కిసగమైన వసంతను చూస్తుంటే ఆయన మనసు బాధతో బరువెక్కింది.

"అమ్మా! వచ్చిన దానివి వచ్చినట్లే వుండిపోయావు. వాళ్ళ ఏమనుకుంటారో?"

"అత్తయ్యకు స్వస్థత చిక్కేవరకు ఇక్కడ్నుండి కదలొద్దని చెప్పి పంపారు. వారమ్మగారున్నారు గనుక ఇబ్బందిలేదు. మొన్న ఆయన వచ్చినపుడు కూడా అదే చెప్పి వెళ్ళారు."

"ఈ ముసలివాళ్ళం నీకెంత శ్రమ ఇస్తున్నాం తల్లీ!" ఆయన కంఠంలో కృతజ్ఞత ధ్వనించింది.

"అదేం మాట మావయ్యా! తల్లిలేని నన్ను పసితనం నుండి అత్తయ్య గుండెలమీద పెంచింది. నాన్న వున్నా తన స్వార్థమే కాని నన్నేనాడు పట్టించుకోలేదు. మీరే లేకుంటే నా బ్రతుకు ఏమై వుండేదో! అందుకు ఆజన్మాంతం మీకు సేవలు చేసినా ఆ ఋణం తీరదు. మీరు కన్నబిడ్డలానే పెంచారు....ఇప్పుడు పరాయిదానిలా భావించకండి." అంది కళ్ళొత్తుకుంటూ.

వసంత మాటలకు ఆయన గొంతు పెగల్లేదు.

ఎముకలగూడు మీద చర్మం కప్పినట్లున్న భార్య సరస్వతి శుష్కించిన శరీరంకేసి చూసే కొలది ఆయన మనసు వికలమౌ తుంది. గాలికి టపటప కొట్టుకొంటున్న దీపానికి చేతులడ్డుపెట్టినట్లుగా, మందులతో తాత్కాలికంగా ప్రాణాలు నిలుపుకొస్తున్నా, ఏ క్షణాల్లో విధి రెక్కల విసురుకు ఈ దీపం కొండెక్కుతుందోనన్న భయం ఆయనను వణికిస్తుంది.

భార్యనలా చూస్తూ, ఆలోచనల తీవ్రతను తట్టుకోలేక మెల్లగా వరండాలో కొచ్చి కూర్చున్నారు. నిప్పుకణికల్లా మండుతున్న కళ్ళు మూసుకుని, మునివేళ్ళతో నలుపుకొంటూ ఆలోచనలో మునిగిపోయారు.

తనూ, సరస్వతి వసంతను కోడలిగా చేసుకోవాలని ఎంతో ఉబలాటపడ్డారు. బంగారు బొమ్మలా వుండే వసంత నాడిస్తూ, 'ఇది మన కృష్ణ పెళ్ళామండీ' అంటూ ఎన్నోసార్లు మురిసిపోయేది సరస్వతి.

వసంత తెలివి తేటలు, వినయ విధేయతలు, నిర్మలమైన మనసు, స్వచ్ఛత తమను ముగ్ధుల్ని చేసేవి. కాబోయే తమ కోడలిగా ఊహించుకొంటుంటే ఇద్దరి మనసులు సంతోషంతో పొంగిపోయేవి.

వాళ్ళిద్దరూ దంపతులు కావాలనే ఆలోచనలు, ఇద్దరూ ఎదిగే కొలది ఇంకా బలపడుతుండేవి.

"సరస్వతీ ! నీ కొడుకు డాక్టరను కొంటున్నావేమో ! వసంతను చేసుకోవటమనేది కేవలం వాడి అదృష్టమే !" ఆటలు పట్టించే

వాడు తను.

"నా కొడుక్కేంవండి ! డాక్టరు పెళ్ళాం కావటం మాత్రం దీని అదృష్టంకాదూ !" ఉడుక్కొనేది సరస్వతి.

ఇలాంటి మాటలు చెవినబడ్డప్పుడు సిగ్గుతో ముఖం తప్పించే వసంత మనసు కృష్ణపై ఇష్టతను చాటేది. వాడు ప్రతి క్లాసులో ఫస్ట్ వస్తున్నప్పుడు, డాక్టరుసీటు వచ్చినప్పుడు, వసంత ముఖంలో కనిపించిన వెలుగు ఈ నాటికి గుర్తే.

తన చదువుకన్నా బావ చదువే ముఖ్యమనుకొనేది. "మావయ్యా ! ఇంతవరకు చదివించారు, చాలు. నేను డిగ్రీ చదవాలను కోవటం లేదు." అంది డిగ్రీలో చేరకముందు.

"ఏమ్మా ! లక్షణంగా చదువొస్తుంటే ఆపేస్తానంటావేం ? నాకు భారం అని ఆలోచిస్తున్నావా?"

"డాక్టర్ చదువంటే చాలా ఖర్చుగదా ? నా గురించి ఇబ్బంది పడటం దేనికి మావయ్యా ! నాకీ మాత్రం చదువుచాలు."

వసంత ఆంతర్యం బోధపడింది. "వసంతా! నువ్వెందుకలా అంటున్నావో తెలుసమ్మా. నాకిద్దరు బిడ్డలయితే ఒకర్ని మానిపిస్తానా ? నువ్వూ అంతే. తప్పక చదవాల్సిందే." తనెంతో పట్టుబడితే కాదనలేక డిగ్రీలో చేరింది.

ముందు ముందు కృష్ణకు వసంతపై అభిమానం అనిపించినా, మూడో సంవత్సరంలో అడుగుపెట్టినప్పట్నుండి దూరంగా పట్టీపట్టనట్లు మెలుగుతుంటే, చదువుమీద చూపిస్తున్న శ్రద్ధనుకొన్నారు.

హౌస్ సర్జన్ పూర్తయినాక కాని వాడు కావాలనే వసంతకు

దూరమయ్యాడని తెలిసిరాలేదు. తన కలలు పండించుకోవటం కోసం అందరి గుండెల్లో మంటలు రేపుతాడని ఏనాడూ అనుకోలేదు. ....జరగాల్సింది జరిగిపోయింది.

"పంతులుగారూ! మీ కృష్ణను అల్లుడిగా చేసుకోవాలను కొంటున్నాను. మీకేం అభ్యంతరం లేదనుకొంటాను!" సౌజన్యరావు గారు స్వయంగా వచ్చి అడిగితే ఆశ్చర్యపోయాడు. ఆయన ఈ పట్టణంలో పెద్ద ధనవంతుడు.

"క్షమించండి! చిన్నప్పట్నుండి మేనకోడల్నే కృష్ణకు చేసుకోవాలను కొంటున్నాం." తన ఉద్దేశం చెప్పాడు.

"బహుశ అది మీ కోరిక అయివుంటుంది.కాని మా హేమ, మీ కృష్ణ తాముగా ఇష్టపడి పెళ్ళి చేసుకోవాలను కొంటున్నప్పుడు, పెద్దలుగా అక్షింతలు వేయటం మన బాధ్యత.ఆలోచించి చెప్పండి." ఆయనమాటలు ఎంతోకాలంగా పెంచుకొన్న ఆశలను కూలదోశాయి.

ఇది తెలిసి సరస్వతి కుమిలిపోయింది.

"కృష్ణా! పెళ్ళంటే తెలీని పసితనంనుండి వసంతలో ఆశలు పెంచాం. ఇప్పుడు కాదని దూరం చెయ్యటం అన్యాయం అవుతుంది. బాగా ఆలోచించి చెప్పు." అడిగాడు కృష్ణను.

"నాన్నగారూ! నేనుగా అందుకు బాధ్యుణ్ని కాను. నా జీవితంమీద నాకు ఆశలు, కోరికలూ వున్నాయి. పెళ్ళనేది నా భవిష్యత్తుకు ముడిపడి వుంది. మీ మాట కాదంటున్నందుకు క్షమించండి."

సౌజన్యరావు అల్లుడు కావాలనుకోవటంలో వాడి ఆలోచన అర్థమై, మరేం మాట్లాడ లేకపోయాడు. ఒకరి ఇష్టాలను తనేనాడు శాసించ లేదు. కృష్ణ కోరుకొన్నట్లుగానే అంతా జరిపించటానికి సిద్ధపడ్డాడు.

"వసంతా! ఈవిషయంలో పూర్తితప్పు మాదేనమ్మా! పెద్దల మచ్చట్లు ఎదగని పిల్లల మనసు మీద ఎలాంటి ముద్రలు వేస్తా మో గ్రహించక, అందుకు వ్యతిరేకంగా జరిగేప్పుడు కేవలం ప్రేక్ష కుల్లా మిగిలిపోవాల్సిన పరిస్థితికి నిన్ను క్షమాపణ వేడుకొంటు న్నాం." తనెంతో బాధగా అన్నాడు.

"అంతగా బాధపడ్తారేం మావయ్యా! నాకిలాంటి జీవితమే లభించాలన్న ఆశలతో నే నేనాడూ కలలు గనలేదు. ఎదిగేకొలది, నాకెలాంటిది లభించినా స్వీకరించి సంతోషమయం చేసుకోవటానికి సిద్ధపడటమే ఉన్నత మార్గంగా భావించాను." వసంత ఒక గొప్ప సత్యాన్ని చెప్పినట్లనిపించింది. ఆశలకు పోకుండా, లభించిన ఏకొద్ది పాటిదైనా ధైర్యంగా స్వీకరించే ఔన్నత్యం ఎందరి కుంటుంది?

పెళ్ళికి ముందు, "పంతులుగారూ! అబ్బాయి చదువుకోసం మీరెంతో ఖర్చు పెట్టివుంటారు. అందుకు కాస్తో, కూస్తో అప్పులయి వుండొచ్చు. మీకు కావాల్సినంత అడిగి తీసుకోండి." సౌజన్యరావు గారి మాటలకు ఫెళ్ళున చెంపమీద చరిచినట్లయింది.

"రావుగారూ! బిడ్డల్ని పెంచి పెద్దజేసి, యోగ్యులుగాతీర్చి దిద్దటంలో వ్యాపార దృష్టి వుంటుందని మీరు భావిస్తున్నందుకు విచారిస్తున్నాను. రిటైర్ కాగానే నేను తీర్చుకోగలను." తిరస్క రించాడు తను.

పెళ్ళి చాలా ఆడంబరంగా జరిపించారు రావుగారు. తెలిసిన వాళ్ళంతా, కృష్ణను, తమను అదృష్టవంతులంటూ అభినందించారు. క్రొత్త దంపతులను మనసారా దీవిస్తూ తామూ అక్షింతలు వేశారు.

కృష్ణ పెళ్ళి తాము ఆశించిన విధంగా జరగలేదన్న బాధను సరస్వతి, తానూ దిగమ్రింగినా, వసంతను గూర్చిన ఆలోచనలే మనసును బాధించేవి. బి.యిడి. ట్రయినింగ్‌లో వసంత క్లాస్‌మేట్ రమాపతి స్వయంగా వచ్చి, కోరి వసంతను వివాహం చేసుకోవటం ఎంతో సంతోషం కలిగించింది.

వజ్రం విలువను గుర్తించటం కొందరికే తెలుసు.

"మావయ్యా! ఓ సారి లోపలకు రండి. అత్తయ్య పిలుస్తుంది." వసంత మాటలకు ఆలోచనలు చెదిరి ఆదుర్దాగా లోపలకు నడిచారు.

మంచంమీద ప్రక్కగా కూర్చుని, భార్య చేతుల్ని ఒడిలోకి తీసుకొని, "సరస్వతి!....సరస్వతీ!" ప్రేమగా పిలిచారు.

సరస్వతి మెల్లగా కళ్ళువిప్పి భర్తకేసి నిశ్చలంగా చూస్తుండిపోయింది. ఆమె కళ్ళనుండి నీళ్ళు జాలువారుతున్నాయి.

"ఏం కావాలి సరస్వతీ!" మార్దవంగా అడిగారు.

"కృ....ష్ణ....రాలేదు కదూ!" జీరగా పలికింది గొంతు.

ఆ మాటలు సీతాపతిగారి మనసును పిండినట్లయింది. ఏమని సమాధానం చెప్పాలో తోచలేదు.

"అసలు వ....స్తాడా?" ఆవిడ మాటల్లో నిరాశ ధ్వనించింది.

"వస్తాడు....తప్పకుండా వాడు వస్తాడు." ఆయన కంఠం

వణికింది.

"మీరు అసలు....ఉత్తరం....రాశారా ?"

"రాశాను సరస్వతి !"

"మరింకా రాలేదేం!... అంది వుంటుందా ?"

"ఈపాటికి బయల్దేరి వస్తుండాలి. నీకు ఆరోగ్యం బాగలేద ని తెలిసిన తర్వాత రాకుండా ఎలా వుంటాడు ?" భార్య సంతృప్తి కోసం అన్నా ఆయనకు నమ్మకం పోతుంది.

కేబుల్ ఇచ్చిన సంగతి భార్యకు చెప్పటం ఆయన కిష్టం లేదు. లెక్క ప్రకారం కేబుల్ అందగానే బయల్దేరితే ఈ పాటికి వచ్చి వుండాల్సిందే.

"మీరు ఉత్తరం....సరిగా....రాశారో....లేదో ! అమ్మ.... బావుబతు....కుల్లో....వుందని" దుఃఖంతో మాట్లాడలేక పోయింది.

"వెంటనే బయల్దేరమని రాశాను. నీకేం ఫర్వాలేదు. తప్పక తగ్గిపోతుంది. అధైర్యపడకు," బాధను అణచుకొంటూ అన్నారు.

ఆమె పెదాలు చిత్రంగా విచ్చుకొన్నాయి. దానర్థం గ్రహిం చిన సీతాపతిగారి మనసు విలవిలలాడింది, ఒక నిమిషం బాధగా కళ్ళు మూసుకొందామె. అంతర్గతంగా ఆమె అనుభవిస్తున్న బాధ కు ఆయన హృదయంలో అగ్నిపర్వతాలు బ్రద్ధలవుతున్నాయి. సర స్వతి తిరిగిబలవంతంగా కళ్ళువిప్పింది. పొడారిన పెదాలునాలుకతో తడిచేసుకోవటం గమనించి వసంతను కాస్త పాలుతెమ్మన్నారు.

స్పూనుతోపట్టి నోట్లోపోశారు. అతి కష్టంమీద ఒక్కగుక్క మింగగలిగింది. రెండో గుక్క వేయలేక పోవటంతో క్రిందకుజారి

పోయాయి. తిరిగి పట్టబోతుంటే వద్దన్నట్లు చేత్తో నెట్టివేసింది.

"తాగు సరస్వతీ! నాల్రోజులనుండి గుక్కెడు పాలయినా తాగటంలేదు." ఆయన ప్రాధేయపూర్వకంగా అడిగినా వద్దని తలూపింది. ఆయన చేతుల్ని గుండెమీదకు తీసుకొని తదేకంగా చూస్తుండి పోయింది.

ఆ చూపుల ద్వారా జీవిత గతస్మృతులు ఆయనలో ప్రవాహంలా లీనం అవుతుంటే సీతాపతిగారికి కన్నీరాగటంలేదు. వసంత మూగగా రోదిస్తుంది.

"ప్రాణం పోయే....లోగా....ఒక్కసారి...వాడ్ని....చూడా....ల....నుంది." ఆయన కళ్ళనుండి నీళ్ళుజారాయి. దుఃఖంతో గొంతు పెగల్లేదు.

"కృ....ష్ణా!....నాకోసం రావూ?" వేలాది మైళ్ళదూరంలో వున్న కొడుక్కి వినిపించాలన్నట్లుగా కలవరిస్తూ మగతలోకి జారి పోయింది.

సీతాపతిగారు వెర్రిగా చూస్తుండిపోయారు.

"మావయ్యా! ఎందుకైనా మంచిది. మరోసారి కేబుల్ ఇవ్వండి." అంది వసంత కళ్ళొత్తుకుంటూ.

సీతాపతిగారు సమాధానం చెప్పకుండా లేచి వరండాలోకి నడిచి, పడకకుర్చీలో నిస్సత్తువగా వాలిపోయారు.

తొమ్మిది నెలలు మోసి, కని, పెంచి పెద్దజేసి, జీవితాని కో మార్గం చూపినందుకు బిడ్డనుండి చివరిక్షణాల్లో సరస్వతి ఆశించేది, ప్రేమపూరితమైన కడసారి చూపు మాత్రమే.

ఆ మాత్రపు కనీస కోర్కె దక్కించుకోవటానికి తల్లిగా సర స్వతి పడే వేదన కృష్ణకు ఎలా అర్థం అవుతుంది? వాడి ఆశలు, కోరికలు వేరు. అవి తీర్చుకునేందుకు ప్రలోభంతో మాతృభూమినే వదిలిపెట్టినవాడికి మాతృమూర్తి హృదయం ఎలాబోధపడుతుంది?

కృష్ణ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు, తనతో సమంగా కష్టా లను సంతోషంగా పంచుకొని వాడికి కష్టమంటే ఏమిటో తెలీకుండా పెంచింది. కొడుకు డాక్టరు కాబోతున్నాడని అంతులేని సంతోషంతో పొంగిపోయింది. అంత ఖర్చు భరించగలమాని తను అధైర్యపడు తుంటే, అవసరమయితే ఓ పూట పస్తులుండామంటూ ధైర్యంచెప్పిం ది. వాడి అవసరాలకోసం అర్ధాకలితో కష్టంగా రోజులుగడిపారు.

కోరుకొన్న విధంగా అన్నీ సాధించుకొన్నాడు. వాడి ఇష్టా లకు వ్యతిరేకంగా ఏనాడూ చెప్పలేదు. బాధను గుండెల్లోనే అణుచు కొని మనసును సరిపెట్టుకొన్నారు.

పెళ్ళయిన తర్వాత వెంటనే యమ్.యస్. చదవడానికి వెళ్ళా డు. అప్పుడప్పుడు సెలవలకొచ్చి మావగారింట్లో వుండి, వచ్చి పల కరించి పోయేవాడు.చదివే రోజుల్లోనే పండంటి మనవడు పుట్టాడు.

చదువు పూర్తయి తిరిగి రాగానే మావగారి సహాయంతో డిస్పెన్సరీ పెట్టాడు. అప్పుడూ వారింట్లోనే వుంటూ అప్పుడప్పుడు వచ్చి కొద్దిసేపుండి వెళ్ళిపోతుండేవాళ్ళు. కోడలు హేమ పట్టీ పట్ట నట్లుండేది.

ఆ స్థానంలో లేవి వసంతను తల్చుకొన్నప్పుడల్లా మనసు చివుక్కుమనేది. హేమ తమ కోడలయినా ఏదో అంతస్థుల దూరం.

కృష్ణ మావగారింట్లో వుండిపోవటం సరస్వతికి బాధ కలిగించింది.

"కృష్ణా! ఇల్లరికం అల్లుడిలా ఎప్పుడూ అక్కడే వుంటావేం రా? నలుగురూ ఏమనుకొంటారు? ఇక్కడేవచ్చి వుండకూడదూ!" ఓసారి సరస్వతంటే సమాధానం చెప్పలేదు.

కృష్ణ పరాయివాడిలా వుంటున్నాడన్న బాధ సరస్వతిలో కనిపిస్తున్నా, ఏనాడూ తప్పుగా ఒక్క మాట అనకుండా మౌనంగా బాధను మనసులోనే అణచుకొనేది.

కొడుకూ, కోడలు తన కళ్ళెదుటే వుండాలని, మనవడి ముచ్చట్లతో జీవితం సంతోషంగా గడిచిపోవాలని, కోరుకొన్న సర స్వతికి అదీ దక్కలేదు. ఉన్నది ఒకే ఊళ్ళో అయినా వారం, పది రోజుల కోసారి వచ్చి కొద్దిసేపుండి పోయేవాళ్ళు.

ఆ కొద్దిసేపు సరస్వతి ఎంతో సంతోషంగా గడిపేది. మన వడికి అర్థం కాకున్నా ఎన్నో కబుర్లు చెప్పేది. క్షణం దించకుండా ఆటలాడించేది. వాళ్ళు వెళ్ళిపోతుంటే తన ప్రాణం తీసుకెళ్తున్న ట్లు విలవిలలాడేది. వచ్చి వెళ్ళిన రెండు రోజులు దిగాలుగా వుండే ది. ఆ తర్వాత బాధను దిగమింగి వాళ్ళకోసం రోజూ కళ్ళల్లో వత్తు లేసుకొని ఎదురు చూసేది.

"కృష్ణా! రోజుకోసారయినా నువ్వు కనిపించకుంటే ఏదో దిగులుగా వుంటుంది. తీరిక చేసుకొని రోజూ కాసేపు వస్తుండరా." ఓరోజు ఒంటరిగా వస్తే కృష్ణను అడిగింది.

"అమ్మా! నాది అందరి ఉద్యోగాల్లాంటిది కాదు. రోజూ వచ్చే తీరుబాటు చిక్కదు."

"పోనీ కోడల్ని కూడా తీసుకొచ్చి మనింట్లోనే వుండకూడ దూ ! నీకిక్కడేం లోటు ?"

"అమ్మా ! హేమ మనస్తత్వానికి, మన ఇంటి వాతావరణా నికి సరిపడదమ్మా. చిన్నప్పట్నుండి హేమ పెరిగిన పరిసరాలు వేరు. తీసుకొచ్చినా ఇక్కడ వుండలేదు." కృష్ణ సమాధానానికి మళ్ళీ ఎన్నడూ ఆ ప్రస్తావన తేలేదు.

నిజమే ! తమది కాకులు కట్టుకునే ముళ్ళగూడు లాంటిది. వాళ్ళది పిచ్చుకలు కట్టుకొనే మెత్తని గూడు. ఆ గూటిలో ఉండే సౌఖ్యం తమ గూటిలో ఎలా లభిస్తుంది ?

"నాన్నా ! నేను అమెరికా వెళ్తున్నాను. రేపే ప్రయాణం." ఓరోజు వచ్చి హఠాత్తుగా చెప్పాడు. సరస్వతి ముఖంలో ఉలికిపాటు కనిపించింది.

"కృష్ణా ! మంచి డాక్టరుగా ఇప్పుడిప్పుడే పేరు తెచ్చుకొంటు న్నావు. నీ జీవితం స్థిరపడటానికి తగిన శక్తి సామర్థ్యాలు నీకున్నా యి. అలాంటప్పుడు దేశంకాని దేశం వెళ్ళి అవస్థలు పడటం ఎందు కురా ?" అన్నాడు తను.

"నాన్నగారూ ! ఒక డాక్టరు ప్రతిభకు ఇక్కడ లభించే ప్రతిఫలం వేరు, అక్కడ లభించే ప్రతిఫలం వేరు. ఇక్కడ జీవి తాంతం ధారపోసినా లభించని గుర్తింపు, ఉన్నత జీవితం లభించేం దుకు అక్కడ కొద్దికాలం చాలు. ఎప్పటినుండో నేను కోరుకొంటు న్న అవకాశం ఈనాడు లభించింది. వెళ్ళాలనే నిర్ణయించుకొన్నా ను." తన ఉద్దేశం మారదన్న దృఢసంకల్పంతో అన్నాడు.

సర్వమానవ కళ్యాణానికి ఉద్దేశితమైన పరిశోధనలకు అవకాశాలను వెతుక్కొంటూ వెళ్ళటం అభినందనీయమే. కాని డాక్టర్లవుతున్న ఎందరో యువకులు లక్షలు సంపాదించాలన్న వ్యామోహంతో తనవాళ్ళను, దేశాన్ని వదిలి విదేశాలకు ఎగబడుతున్నారే గాని, తమ సేవలు ఈ దేశానికి ఎంత అవసరమో గుర్తించటంలేదు.

అక్కడ డాక్టరుగా తమకు లభించే ప్రతిఫలం ఎక్కువన్న ఆకర్షణకు లోనవుతున్నారేగాని, ఈ దేశంలో రోగాలకు అధికంగా డబ్బు వెచ్చించుకోలేని ఎందరు నిర్భాగ్యులు పేదరికంతో ప్రాణాలు కోల్పోతున్నారో ఆలోచించటంలేదు.

విదేశం వాళ్ళకు అందమైన స్వర్గం. ఆశావ్యామోహాలే కృష్ణను విదేశాలకు తరలిస్తుంది. తాను కాదని ప్రయోజనం ఏముంది ?

"ఏమండీ ! మనకు ఒక్కగానొక్కడు. వాడ్ని చూడకుండా అంతకాలం నేను వుండలేనండి. ఎలాగైనా మీరు నచ్చజెప్పండి. ఇక్కడ మాత్రం భార్యా బిడ్డలతో హాయిగా బ్రతకలేడా ? మనకు లక్షలు లేకుంటే మాత్రం సుఖంగా బ్రతకటం లేదా ?" ఆ రోజు రాత్రంతా ఏడుస్తూనే వుంది సరస్వతి.

"సరస్వతీ! కాలంతోపాటు విలువలు మారుతున్నాయి. డబ్బుపై వ్యామోహంతో ఆత్మీయతల్ని, అనుబంధాల్ని తెంచుకొని శిలాత్మకంగా బ్రతికేందుకు మనిషి అలవాటు పడుతున్నాడు.మనం చెప్పినా వాడి ప్రయాణం ఆగదు. అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటా

డులే." ఎంతగానో ఓదార్చాడు తను.

విమానాశ్రయంలో-

వీడ్కోలు యివ్వటానికి వచ్చిన బంధు, మిత్రుల మధ్య హడావుడిగా వున్న కృష్ణను, మళ్ళీ చూడగలనో లేదో అన్నట్లుగా క్షణంపాటు ఏమరుపాటు కాకుండా, తనివితీరా చూచుకొంటూ, చాటుగా కన్నీళ్ళు పదేపదే అద్దుకొంటున్న సరస్వతిని చూస్తుంటే గుండె తరుక్కుపోయింది.

"అమ్మా ? వెళ్ళొస్తాను. మీ ఆరోగ్యం జాగ్రత్త." అంటూ కృష్ణ చివరిగా సెలవు తీసుకొంటుంటే చేతులు పట్టుకొని-

"బాబూ! నీవక్కడ వున్నా ఎప్పుడూ కళ్ళలో మెదులుతుంటావు. తరచు ఉత్తరాలు రాస్తుండు. మళ్ళీ ఎప్పుడు చూస్తానో నిన్ను." ఏడ్చింది సరస్వతి.

"నా గురించేం దిగులు పెట్టుకోనకమ్మా! ఉత్తరాలు రాస్తుంటాను. హేమను తీసుకెళ్ళటానికి వచ్చే సంవత్సరం వస్తానుగా." అంటూ ముందుకు కదిలిపోయాడు.

కృష్ణ వెళ్ళిన మరునాటి నుండే సరస్వతి మంచం పట్టింది. తిరిగి కోలుకోవటానికి ఒక నెలరోజులు పట్టింది. ఆ తర్వాత ఎప్పుడూ పరధ్యానంగా, ఏదో పోగొట్టుకున్నదానిలా వుండేది.

"ఏమండీ ! ఒక్కడూ అంత దూరంలో ఎలా వున్నాడో ! వాడి కన్నీ సక్రమంగా అమరుతున్నాయో లేదో!" అంటూ తలవని రోజు లేదు. వాడినుండి వచ్చే ఉత్తరాల కోసం ఆత్రంగా ఎదురు చూసేది.

కృష్ణమీద బెంగతో వేళకు తినకా నిద్రపోక తరచు అనారోగ్యానికి గురవుతుంటే ఏంచెయ్యాలో తోచక సతమతమయ్యేవాడు.

ఓ రోజు, "ఏమండీ! హేమ, పిల్లవాడు అమెరికా వెళ్ళే దాకా మనింట్లోనే వుంటారు. వెళ్ళి తీసుకురండి. వాళ్ళను చూసు కొంటుంటే నా మనసు కాస్త కుదుటపడుతుంది." ప్రాధేయపడింది.

ఈ విధంగా నైనా కొంతకాలం సరస్వతి దిగులు పోతుం దన్న ఆశతో వారింటి కెళ్ళాడు. సౌజన్యరావుగారికి సరస్వతి పరిస్థితి వివరించి హేమను పంపించమని అడిగితే ఆయనేం అభ్యంతరం చెప్పలేదు. హేమను పిలిచి చెప్పారు.

"సారీ మావయ్యా! ఒంటరిగా వుండాలంటే అక్కడేం తోచదు. బాబుకు వేళకు అన్నీ అమరాలన్నా కష్టమే. అంతగా కావాలంటే అత్తయ్యను అప్పుడప్పుడు తీసుకురండి. నేను మాత్రం ఓ దగ్గర ఎల్లకాలం వుండలేనుగా." మరోమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా వెళ్ళిపోయింది.

తను నిరాశతో తిరిగొచ్చాడు. ఆశతో ఎదురొచ్చిన సరస్వతికి, హేమ ఆరోగ్యం అంతగా బావుండటం లేదంటూ అబద్ధం చెప్పాల్సి వచ్చింది.

ఆ తర్వాత కొద్ది నెలలకే హేమ పిల్లవాడితో అమెరికా బయల్దేరి వెళ్ళి పోయింది. ఇంతలోనే తను రావటం అనవసరపు ఖర్చని, ఏర్పాట్లన్నీ చేసి ఇద్దర్నీ విమానం ఎక్కిస్తే తను అక్కడ రిసీవ్ చేసుకొంటానని ఉత్తరం రాస్తే, సౌజన్యరావుగారు అలానే చేశారు.

హేమను తీసికెళ్ళటానికి త్వరలోనే వస్తాడని ఆశతో ఎదురు చూస్తున్న సరస్వతి ఎంతో కుమిలిపోయింది. "ఇంతకాలం వాడు త్వరలో వస్తాడని ఆశపడ్డాను. మళ్ళీ ఎంత కాలానికి వాడ్ని చూస్తానో!" ఏడుస్తుంటే వోదార్చాడు.

రెండేళ్ళు గడిచిపోయాయి.

కృష్ణ రాసే ఉత్తరం కోసం, అందులో ప్రయాణం గురించిన ప్రస్తావన కోసం పిచ్చిదానిలా ఎదురుచూపే సరస్వతిని చూస్తుంటే జాలి, బాధ వేసేది.

అమ్మ చూడాలని ఆరాటపడ్తుందని, ఒక్కసారి వచ్చి పొమ్మని, తన మాటగా రాయమని ఎన్నోసార్లు కోరితే కనీసం అరడజను ఉత్తరాలకు గాని జవాబు రాలేదు.

"నాన్నా! మీరు మరీ సెంటిమెంటల్‌గా ఫీలవుతున్నారు. ఇక్కడ ప్రజల్లో అలాంటి సెంటిమెంట్స్ వుండవు. ఎవరికి వారుగా తమ జీవితాలను చాకచక్యంగా తీర్చి దిద్దుకొంటారు గనుకనే ఇక్కడ అంతగా అభివృద్ధి కనిపిస్తుంది. అంతా ఒకసారి రావాలంటే ఎంత ఖర్చో ఆలోచించండి. ఇప్పుడిప్పుడే నేను నిలదొక్కుకొంటున్నాను. ఇంకా కొన్నేళ్ళపాటు వచ్చే అవకాశం ఉండదేమో! నాలుగువందల డాలర్లకు చెక్కు పంపుతున్నాను. మీకు కావల్సినవి తీసుకోండి." కృష్ణ రాసిన జవాబు.

వాడు రాసినట్లుగా చెప్పి సరస్వతిని బాధపెట్టడం ఇష్టంలేక మరోలా చెప్పి చెక్కు చేతిలో పెట్టాడు తను. వెర్రిదానిలా కాసేపు చూసుకొంది.

"ఇన్నేళ్ళనుండి వాడినుండిదీనికోసం మనం ఆరాటపడ్డామా!

డబ్బులోటు మనకేం వుందండీ ! వాడు ఇబ్బంది పడతాడేమో తిరిగి పంపించండి." అంటూ చేతిలో పెట్టేసింది.

డబ్బు అవసరం తమకేం లేదని రాస్తూ, కృష్ణకు తిప్పి పంపేశాడు.

ఆ తర్వాత గడిచిన నాలుగేళ్ళలోనూ సరస్వతి, కృష్ణను రమ్మని రాయమని అడగలేదు. తనూ రాయలేదు. కాని అంతర్గత వేదనకు సాక్ష్యం మాత్రం బాగా క్షీణించిన ఆరోగ్యమే.

ఆ ఆవేదన ఇన్నేళ్ళుగా గూడుకట్టుకొంటూ ఒక్కసారి బ్రద్దలై ఆమె ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీసింది. పర్యవసానంగా, బిడ్డను కడసారి చూడాలన్న కోర్కెతో చావుబ్రతుకుల మధ్య కొట్టు మిట్టులాడుతుంది సరస్వతి.

అమ్మ ఆరోగ్యం ఏమాత్రం ఆశాజనకంగా లేదని, వచ్చిపొమ్మని ఈ నెల రోజుల్లో నాలుగు ఉత్తరాలు రాసినా ఫలితంలేక చివరకు వారంక్రితం కేబుల్ ఇచ్చాడు .... చావుబ్రతుకుల్లో వున్న తనను చూడటానికి తప్పక వస్తాడన్న ఆశతో ప్రాణాలు నిలుపుకొంటుంది.

భార్య, భర్త, బిడ్డలంటూ అవ్యాజమైన మమతానుబంధాలతో, నిర్మితమైన ఈ దేశ సంస్కృతి, సంప్రదాయాలను తనలో జీర్ణించుకొని పెరిగిన సరస్వతికి, అవన్నీ అర్థంలేని సెంటిమెంట్స్‌గా కొట్టి పారేస్తూ, పరదేశ నాగరికతకు వ్యామోహితుడై, తన వ్యవస్థనే తప్పుపడ్తున్న కృష్ణకూ మధ్య అడకత్తెరలో పోక చెక్కలా నలిగిపోతూ తనూ —

ప్రతి కొత్త తరం అమూల్యమైన వాటిని పాతతరం నుండి

స్వీకరిస్తూ క్రొత్తవి సేకరించుకొంటూ, ఒక నవీన వ్యవస్థను పునర్నిర్మించుకోవాల్సిందే. అప్పుడే పటిష్టమైన ఒక భవిష్యత్ ప్రపంచం ఏర్పడుతుంది.

అయితే తరాలలో ప్రవేశిస్తున్న వ్యామోహాలు, ప్రలోభాలు, ఆకర్షణలు ఒక వ్యవస్థయొక్క ఉన్నతత్వాన్ని బహిష్కరించు కొంటూ తిరోగమిస్తున్నాయా ?

ఆవేదనా పూరితమైన ఆలోచనలతో బడలికగా కొద్దిసేపు కళ్ళు మూసుకొన్నారు. వెంటనే మాగన్నుగా నిద్రలోకి జారి పోయారు. ఆ తరువాత తెల్లవారటానికి ఎంతోసేపు పట్టలేదు.

* * *

వసంత కేకకు నిద్రపోతున్న సీతాపతిగారు తుళ్ళిపడిలేచి లోపలకు పరుగెత్తారు. బాధతో విలవిలలాడుతూ దయనీయ స్థితిలో సరస్వతి. ఓమేష్‌కోపం వెళుతున్నంతలో అతనేవస్తూ కనిపించాడు.

"లాభంలేదు. పరిస్థితి పూర్తిగా విషమించింది. చివరి క్షణా లనుకోవచ్చు." అర్ధగంటసేపు విఫలయత్నం చేశాడు రమేష్.

దీపం కడసారి వెలుగన్నట్లుగా సరస్వతి కళ్ళు విప్పింది. మంచంచుట్టూ నిలబడున్న అందర్నీ తేరిపార చూసింది. ఆ కళ్ళు వెదికేది ఎవరికోసమో సీతాపతిగారికి తెలుసు.

"సరస్వతి ! సరస్వతీ." దుఃఖంగా ఒడిలోకి తీసుకొన్నారు.

"కృ....కృ....ష్ణ!" గొంతులో నుండి ధ్వని కష్టంగా వెలు వడింది. సమాధానంగా ఆయన కళ్ళు వర్షించాయి.

బలవంతాన దుఃఖాన్ని దిగమింగుతున్న వసంత ప్రక్క గదిలోకి పరిగెత్తి క్షణాల్లో కృష్ణ ఫోటోప్రేముతో తిరిగొచ్చి,

సీతాపతిగారికి అందించింది.

వణుకుతున్న చేతులతో సరస్వతి దాన్ని అందుకొంది. ఆ కళ్ళ నుండి వాత్సల్యం అణుప్రవాహంలా కృష్ణ రూపాన్ని తాకుతూ చివరిసారిగా వెలిగాయి. ఫోటోను పెదవులతో మెల్లగా స్పృశించింది.

అంతే! ఆమె శరీరం క్షణాల్లో కట్టెలా బిగుసుకుపోయింది.

"సరస్వతీ!" రోదించారు సీతాపతిగారు. వసంత దుఃఖానికి అంతులేదు.

* * *

"తల్లి చావుబతుకుల్లో వుందని తెలిసి వెంటనే రాలేనివాడు, శవాన్ని చూడటానికైనా వస్తాడన్న నమ్మకంలేదు. ప్రతినిమిషం వాడికి కొన్ని వందలరూపాయల నష్టం తెస్తుంది. ఎవరైతే కడసారి వాడ్ని చూడాలని ఆశపడ్డారో ఆమె బ్రతికిలేదు. ఇంకెందుకు ఆగడం? జరగాల్సింది జరగనివ్వండి." సీతాపతిగారు మర్నాడే దహనానికి సిద్ధపడ్డారు.

సాయంత్రానికి జీవంలేని శరీరం కట్టెల్లో కాలి బూడిదగా మిగిలింది. తన చేతులతోనే తలకొరివి పెట్టారు.

"పాపం! చివరిదాకా బిడ్డను చూడాలని ఎంతగానో తహతహలాడింది. అంతగా ప్రేమించిన కొడుకు తలకొరివి పెట్టేందుకు కూడా లేకపోయాడు. రోజులే అంత." ఎవరో అనటం వినిపించిన సీతాపతిగారికి దుఃఖం ఆగలేదు.

(యువ, జనవరి 1982)